నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 24 మార్చి 2025 | NIZAMABAD

విషాదకథ.. కంచికేనా?

ఫోరెన్సిక్ నివేదికలో ఏముంది?

- పోస్ట్‌మార్టం రిపోర్ట్ చెబుతున్నది ఏమిటి?
- ముగ్గురు మృతి కేసులో పడకేసిన దర్యాప్తు
- నాలుగు నెలలవుతున్నా కేసులో పురోగతి కరువు..
- కామారెడ్డి పోలీసులకు సవాల్‌గా మారిన ఆధారాల సేకరణ
- అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ముగ్గురు మృతి చెందిన ఘటనకు రేపటికి నాలుగు నెలలు

నిజామాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎలాంటి కేసులనైనా ఛేదించే పోలీసులు.. కొన్ని సందర్భాల్లో కొన్ని కేసులు సవాలుగా మారుతుంటాయి. అలాంటిదే ఈ కేసు కూడా. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో మృతి చెందిన ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్‌కు సంబంధించిన కేసు లో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ నెల 25వ తేదీ నాటికి సరిగ్గా ఈ ఘటన జరిగి నాలుగు నెలలు అవుతున్నది. అయినప్పటికీ కామారెడ్డి పోలీసులు మాత్రం ఈ కేసులో ఎలాంటి పురోగతినీ సాధించకపోవడం గమనార్హం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఈ కాలంలో ముగ్గురు మృతి చెందిన కేసులో ఎలాంటి ఆధారాలను కనుక్కోలేక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముగ్గురు కలిసి చనిపోయారా? ఎవరైనా ముందుగా దూకితే కాపాడే ప్రయత్నంలో అందరూ చెరువులో మునిగారా? లేదంటే హత్యాయత్నం జరిగిందా? అనే అనుమానాలను నివృత్తి చేసేందుకు పోలీసులు ముందుకు రావడం లేదు. ఫోరెన్సిక్, పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లకు రోజుల తరబడి కాలం పట్టడం. ఈ ఘటన జరిగి నాలుగు నెలలువుతుండగా..ఇప్పటికే దర్యాప్తు అధికారులకు సంబంధిత నివేదికలు వచ్చే ఉంటాయి. అందులో ఏముంది? అనేది ఎవ్వరికీ అంతు చిక్కడం లేదు. ఎస్సై, మహిళా కానిస్టేబుళ్ల మధ్య పరిచయం ఉంది. ఎస్సై వద్ద కానిస్టేబుల్ పని చేసిన కారణంగా వారిద్దరి మధ్య మాటలు కలిసే అవకాశం లేకపోలేదు. కానీ ఇందులో మూడో వ్యక్తి రావడం. అతను అనూహ్యంగా వీరితో పాటే మృత్యువాత పడడంపై ఆసక్తి నెలకొన్నది. నిరుపేద కుటుంబానికి చెందిన నిఖిల్‌కు ఎలాంటి ఆధారమూ లేదు. ప్రైవేటుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసుకుంటూ బతుకుతున్నాడు. ఈ పరిస్థితిలో అర్థాంతరంగా ఎస్సై, కానిస్టేబుళ్లతో కలిసి చనిపోవడానికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయంపై పోలీసులే స్పష్టతను ఇవ్వాల్సి ఉండగా ఎంతకూ పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో బాధితులు, నిందితులు, సాక్షులు అంతా మృతి చెందిన ఈ ముగ్గురే కావడంతో పోలీసులు సైతం కేసును పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

ఎస్పీ రాజేశ్ చంద్ర దృష్టి సారించేనా?

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఎస్సై, కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ మూకుమ్మడి మృతి కేసును కొత్తగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్ చంద్ర నేతృత్వంలోనైనా ఒక ముగింపును పోలీసులు అందిస్తారని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. ప్రజల మాన, ప్రాణాలను రక్షించాల్సిన పోలీసులే ఈ కేసులో భాగస్వామ్యమై ఉండడంతో జనాల్లోనూ ఆసక్తి ఏర్పడింది. అందులో ఒక ఎస్సై, మహిళా కానిస్టేబుల్ ఉండడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. కష్టపడి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించిన శృతి, జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఎస్సైగా ఉద్యోగం సాధించిన సాయికుమార్ ఏ కారణం వల్ల చనిపోవాల్సి వచ్చిందనేదే వెయ్యి డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ఈ కేసును ఛేదించడం ఇప్పుడు కామారెడ్డి పోలీసులకు కనీస బాధ్యతగా మారింది. నేర శోధనలో దేశంలో ప్రత్యేక స్థానం ఉన్నదని తెలంగాణ పోలీసులు చెప్పుకుంటున్నారు. ఈక్రమంలో సంచలన కేసును చెరువు గట్టుకే వదిలేయకుండా ఫోరెన్సిక్, పోస్ట్‌మార్టం రిపోర్ట్‌ల ఆధారంగా ప్రజలకు నిజాలను వెల్లడించి తమ సత్తాను చాటుకోవాలని ప్రజలంతా కోరుతున్నారు. గంటల వ్యవధిలోనే దొంగతనాలను, దోపిడీలను, హత్య కేసులను ఛేదించిన కామారెడ్డి పోలీసులకు ఈ కేసును సైతం తమదైన శైలిలో ఆధారాల సహితంగా ముగింపు పలకడం పెద్ద విషయమేమీ కాదు. కాకపోతే ఇందులో పోలీసులే పాత్రధారులుగా ఉండడంతో తమ శాఖ పరువును కాపాడుకునేందుకే ఈ కేసును పట్టించుకోవడం లేదన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

నివేదికలు ఏం చెబుతున్నాయి?

అడ్లూర్ ఎల్లారెడ్డి కేసులో ముగ్గురూ నీటిలో మునిగి చనిపోయారు. అయితే వారిని ఎవరైనా బలవంతంగా ముంచారా? లేదంటే ఎవరికి వారే నీళ్లలో దిగారా? వేరే వ్యక్తి ఎవరైనా వీరిని బలవంతంగా ముంచేశారా? అన్నది సాంకేతిక పరిజ్ఞానంతో కనుగొనే అవకాశం ప్రస్తుతం పోలీసులకు మాత్రమే ఉంది. ఒక వ్యక్తి నీళ్లలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నిస్తే చెరువులోని నీళ్లు నేరుగా కడుపులోకి వెళ్తాయి. తద్వారా అది ఆత్మహత్యగా నివేదికలో స్పష్టం అవుతుంది. లేదంటే చంపేసిన తర్వాత మృతదేహాన్ని నీళ్లలో పడేస్తే అప్పుడు చెరువు నీళ్లు నేరుగా డెడ్‌బాడీలోకి వెళ్లవు. అప్పుడు అది హత్యగానే నిర్ధారించాల్సి ఉంటుంది. ఇలా పలు సాంకేతిక అంశాలను విశ్లేషించడం ద్వారా మృతులకు సంబంధించిన అంశాల్లో హత్య? ఆత్మహత్యనా? అన్నది తేటతెల్లం చేయొచ్చు. కానీ పోలీసులు మాత్రం ఈ కేసులో దాగి ఉన్న అంతర్లీన అంశాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముగ్గురు మృతి చెందిన ఈ కేసులో ఎస్సై, కానిస్టేబుల్ కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అంతో ఇంతో అండదండలు లభిస్తాయి. పోయిన ప్రాణాలను ఎవ్వరూ తీసుక రాకపోయినప్పటికీ సర్కారు నుంచి వచ్చే సహాయ, సహకారాలు ఉంటాయి. ప్రైవేటు ఆపరేటర్‌కు మాత్రం అలాంటిదేమీ లేకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఎస్సై, కానిస్టేబుల్‌తో ఉన్న పరిచయం నిఖిల్ ప్రాణాలను తీసినట్లయ్యింది. ముగ్గురి ప్రాణాలు పోవడానికి దారి తీసిన అంశాలను విశ్లేషించేందుకు పోలీసుల వద్ద అనేక ఆధారాలు ఉన్నాయి. అందులో ఎస్సై, కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్‌కు సంబంధించిన మొబైల్ ఫోన్‌లను దర్యాప్తు అధికారులు సేకరించారు. వారి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఎవరెవరు ఎక్కడ్నుంచి ఎక్కడికి వచ్చారు? చెరువు వద్ద ఎప్పుడు కలిశారు? వాహనం నడిపిందెవరు? అనే కోణాల్లో వివరాలు సేకరించే అవకాశం మెండుగా ఉంది. తద్వారా కాసింత కేసులో పురోగతి లభించే వీలుంది. కానీ ఈ అంశాన్ని మరుగున పెట్టేసేందుకు ఖాకీలు ఆసక్తి చూపుతున్నట్లుగా అర్థమవుతున్నది.

- తరుముతున్న నీటి ఎద్దడి
- సమీప పంట పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న తండావాసులు
- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు

పంట పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న అంకిరెడ్డిపల్లి తండావాసులు

తండాల్లో దాహం.. దాహం

మాచారెడ్డి, మార్చి 23 : వేసవికి ముందే నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పల్లెల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. బోర్లు వట్టిపోవడంతో సమీపంలోని పంట పొలాల నుంచి నీళ్లను తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. మండలంలోని అంకిరెడ్డిపల్లితండా గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నది. గ్రామానికి తాగు నీరు అందించాల్సిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. తండాల్లో ఉన్న రెండు బోర్లు ఎత్తిపోవడంతో తండావాసులు దూరంలో ఉన్న పంట పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు.

వట్టిపోయిన బోర్లు..

తండాలో ఒకటి వాటర్ ట్యాంక్ వద్ద , మరొకటి నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన బోర్లు వట్టిపోవడంతో నీటి కష్టాలు తీవ్ర మయ్యాయి. తండాలో 60 కుటుంబాలు ఉండగా.. దాదాపు 350 వరకు జనాభా ఉన్నది. మిషన్ భగీరథ నీళ్లు వారానికి ఒకసారి కూడా వస్తాలేవని తండా వాసులు ఆందోళన చెందుతున్నారు. పనులు మానుకోని నీళ్లు తెచ్చుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

అంకిరెడ్డిపల్లితండాలో నీటి సమస్య ఉన్నదని గ్రామస్తులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. తండాలకు సమీపంలో ఉన్న పంట పొలాల వద్ద నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు. పంట పొలాల వద్ద త్రీఫేస్ కరెంట్ ఉన్నప్పుడు మాత్రమే బోర్ల నుంచి నీళ్లు వస్తాయి. వరుసగా పదినిమిషాలు బోరు నడిచిందంటే చాలు మళ్లీ ఐదు నిమిషాలు ఆగాల్సి ఉంటుంది. వేసవికాలంలో తండాలో నీటి సమస్య తీవ్రతరం కానుండడంతో తండావాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు

నల్లా నీళ్లు రావడం లేదు

మా తండాలో వారానికి ఒకసారి కూడా నల్లనీళ్లు వస్త లేవు. నీళ్ల కోసం చాలా గోస పడుతున్నం. నీళ్ల కోసం మేము రెండు రోజులకోసారి పని మానాల్సి వస్తున్నది. ఎండ కాలంలో ఇప్పుడే నీళ్ల గోస ఇట్లా ఉంటే ఇంకా మూడు నెలలు ఎట్ల ఉంటుందో తెలియడంలేదు. మాకు నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నం.

-బానోత్ చంకి , అంకిరెడ్డిపల్లితండా, మాచారెడ్డి మండలం

ఇబ్బంది పడుతున్నం..

ఇంట్లో ఏ పని చేసుకోవాలన్నా నీళ్లు అవసరం. మా తండాలో నీళ్ల కోసం చాలా ఇబ్బంది పడుతున్నం. పిల్లలను పట్టుకొని పంట పొలాల నుంచి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నం. మా ఇంటి వద్ద ఉన్న వాటర్ ట్యాంకు నుంచి నీళ్లు రాక చాలా రోజులైంది.

-గుగులోత్ విజయ, అంకిరెడ్డిపల్లితండా, మాచారెడ్డి మండలం

అధికారులెవరూ పట్టించుకుంటలేరు

మా తండాలో నీళ్లు అస్తలేవని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.నీళ్లు లేక పిల్లలతో గోసగోస అవుతుంది. పంట పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నం. వాళ్లు కూడా ప్రతిరోజూ ఇవ్వడం లేదు. మా పంట పొలాలకు నీళ్లు అందడంలేదని ఇబ్బంది పడుతున్నారు. పొలాల నుంచి నీళ్లు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉన్నది.

-బానోత్ మున్ని, అంకిరెడ్డిపల్లితండా, మాచారెడ్డి మండలం


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

నర్సరీ వద్ద వట్టిపోయిన బోరు

నేడు బాన్సువాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

హాజరుకానున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ, మార్చి 23: పట్టణంలోని పెద్ద మసీదు ఎదురుగా ఉన్న బక్రాన్ బీడీ కాంప్లెక్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఇఫ్తార్ లో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతారని తెలిపారు. ఇఫ్తార్ కార్యక్రమానికి ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నిలదీత

కూలీకి చెందిన డబ్బులు వాడుకున్నాడని గ్రామస్తుల ఆగ్రహం

ఫీల్డ్ అసిస్టెంట్ బసవయ్యను నిలదీస్తున్న కొత్తబాది గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, మార్చి 23: ఉపాధి కూలీకి చెందిన డబ్బులు సొంతానికి వాడుకున్నాడని ఫీల్డ్ అసిస్టెంట్ బసవయ్యను గ్రామస్తులు ఆదివారం నిలదీశారు. బాన్సువాడ మండలం కొత్తబాది గ్రామంలోని ఉపాధి కూలీ అనిల్‌కు చెందిన పోస్టాఫీస్ ఖాతా నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ నాలుగువేల రూపాయలు డ్రాచేసుకున్నాడు. అనిల్ అనే కూలీ ఎమర్జెన్సీ దవాఖానలో ఉన్నాడని బ్రాంచ్‌పోస్ట్ మాస్టర్‌ను నమ్మించి డబ్బులు డ్రా చేసుకున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టాలని అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఫీల్డ్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా.. అనిల్‌కు చెందిన ఖాతా నుంచి బయోమెట్రిక్ ద్వారా డబ్బులు తీసుకోలేదని, బీపీఎం తనకు డబ్బులు ఇస్తే అనిల్‌కు ఇచ్చినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో 'సోషల్'వార్!

- బాల్కొండలో ముదురుతున్న గ్రూపుల వివాదం
- సోషల్ మీడియాలో సునీల్‌రెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు
- ఈరవత్రి వర్గీయులపై కేసు నమోదు!

మోర్తాడ్, మార్చి 23: బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో సోషల్ మీడియా వేదికగా వార్ కొనసాగుతున్నది. కొన్నిరోజులుగా గ్రూపు రాజకీయాలు కొనసాగుతుండగా..తాజాగా సోషల్ మీడియా ద్వారా వ్యతిరేకతను వ్యక్తపరుస్తున్నట్లు సమాచారం. ఇటీవల సోషల్ మీడియాలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా ఇసుక దందాతోపాటు తన అనుచరులకే అనుమతులు ఇప్పిస్తున్నట్లు కొన్నిరోజులుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన చేస్తున్న వ్యాపారాలపై ఇటీవల సోషల్ మీడియాలో పోస్టులు వెలుగుచూశాయి. దీనిపై సునీల్ వర్గీయులు ఆరా తీయగా సోషల్ మీడియాలో పోస్టుచేసింది బడాభీమ్‌గల్‌కు చెందిన వారని గుర్తించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సునీల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగి బడాభీమ్‌గల్‌కు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న ముగ్గురు వ్యక్తులు ఈరవత్రి అనిల్‌కుమార్ వర్గీయులుగా గుర్తించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు భీమ్‌గల్ ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. ముగ్గురిని విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినట్లు పేర్కొన్నారు. ముగ్గురి అరెస్టు నేపథ్యంలో ఇరు వర్గాలకు చెందిన చాలా మంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే సునీల్‌రెడ్డి, అనిల్ వర్గాల మధ్య సోషల్‌మీడియాలో వార్ కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన ఎక్కడికి దారి తీస్తుందోనని ప్రజల్లో ఆసక్తి నెలకొన్నది.

ఎండిన పంట.. జీవాలకు మేతగా..

యాసంగి పంటలు సాగు చేస్తున్న రైతులకు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వరి పంట నీరందక ఎండిపోతున్నది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని కోమట్‌పల్లి గ్రామానికి చెందిన రాకేశ్, శేఖర్ అనే రైతులు వరి సాగు చేశారు. పొలంలోని బోర్లు వట్టిపోయాయి. గింజ గట్టి పడే దశలో నీరు అందక పోవడంతో చేసేదేమీ లేక పంటను వదిలేశారు. దీంతో ఎండిపోయిన పంట గొర్రెలు, మేకలకు మేతగా మారింది.

-లింగంపేట, మార్చి 23